క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి

పి.గన్నవరం: స్థానిక పంచాయతీ రోడ్‌లో శ్రీకోదండరామ యువజన సంఘం, ఆంజనేయ యూత్‌ల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వైష్ణవి కనకదుర్గమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. ప్రతిష్ఠ మహోత్సవాలు ఈనెల 28 నుంచి ప్రారంభమయ్యాయి. ఆదివారం యంత్ర స్థాపన, పూర్ణాహుతి, విగ్రహ ప్రతిష్ఠ, అగ్ని ప్రదక్షిణాధికం, ప్రాణ ప్రతిష్ఠ తదితర పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ కమిటీ నాయకులు భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పాఠశాలకు కలర్ ప్రింటర్



కలర్ ప్రింటర్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: ఆదుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2021–22 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం రూ.15 వేలు విలువ చేసే కలర్ ప్రింటర్ అందజేశారు. దీన్ని స్కూల్ హెచ్‌ఎం ఎస్.శ్రీదేవికి అందజేశారు. పూర్వ విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ నాగాబత్తుల శ్రీకృష్ణ, సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, స్కూల్ స్థలదాత ఇరుకు రెడ్డిపంతులు, ఉపాధ్యాయుల రవికుమార్, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులకు విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ అభివృద్ధి పనులకు హైదరాబాద్‌కు చెందిన సఖిలం శ్రీధర్–ప్రవంతి దంపతులు రూ.10,116 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

శ్రీశ్రీ రచనలతో ప్రజల్లో చైతన్యం



శ్రీశ్రీకి నివాళులర్పిస్తున్న వేదిక అధ్యక్షుడు నాగబాబు

మామిడికుదురు: శ్రీశ్రీ తన రచనల ద్వారా ప్రజల్లో ఎంతో చైతన్యం తీసుకువచ్చారని సహృద సాహితీ సకల కళావేదిక అధ్యక్షుడు పెదమల్లు నాగబాబు పేర్కొన్నారు. స్థానిక బోయి భీమన్న మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఆదివారం శ్రీశ్రీ జయంతిని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవితా గోష్ఠి ఏర్పాటు చేశారు. పలువురు కవులు శ్రీశ్రీ రచనలను కవితల రూపంలో ఆలపించారు. తెలుగు వీర లేవరా అంటూ శ్రీశ్రీ తన సాహిత్యంతో ప్రజల్లో స్ఫూర్తిని నింపారన్నారు. శ్రీశ్రీ కవితలు ప్రతి ఒక్కరినీ తట్టి లేపుతాయన్నారు. కార్యక్రమంలో వేదిక కార్యదర్శి ఏడిద కవీంద్ర, సంయుక్త కార్యదర్శి గాదరాడ రవిచంద్ర, ప్రతినిధులు గంటి చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, యింటి గణపతి, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



వెంకటేశ్వరరావు (ఫైల్)

మామిడికుదురు: మాకనపాలెం మాజీ సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు (57) ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. వెంకటేశ్వరరావు 2006 నుంచి 2011 వరకు అయిదేళ్లు మాకనపాలెం సర్పంచ్‌గా పని చేశారు. ఆయన హయాంలో గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయి. వెంకటేశ్వరరావు అంత్యక్రియలు రాజోలు మండలం సోంపల్లి శ్మశానవాటికలో నిర్వహించారు. వెంకటేశ్వరరావు మృతికి సర్పంచ్ మద్దాల బాబూరావు, ఎంపీటీసీ వలవల పెదబాబుతో పాటు పలువురు సంతాపం తెలిపారు.

పాస్టర్‌ను అరెస్టు చేయాలి

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు చీకురుమిల్లి వారి పేటకు చెందిన పాస్టర్ హోసన్నపై తక్షణమే కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని దళిత బహుజన మహిళా శక్తి జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఆయన దళిత యువతులను మోసం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. చీకురిమిల్లివారిపేటకు చెందిన బాలిక విషయంలో జరిగిన సంఘటనపై గ్రామంలో పర్యటించగా వాస్తవాలు వెలుగు చూశాయన్నారు.

జలపుష్పాల జాడేదీ?

- వ్యర్థాలతో జలాలు కలుషితం
- జీవనోపాధి కోల్పోతున్న మత్స్యకారులు



కాలువలో చేపల కోసం వేట సాగిస్తున్న మత్స్యకారులు

అలమూరు/ఆత్రేయపురం: మాంసాహార ప్రియులకు చేప రకాల్లో 'పులస' తరువాత అంతటి ప్రాధాన్యం సంతరించుకున్న కాలువ చేపలు క్రమేపీ కనుమరుగవుతున్నాయి. గతంలో కాలువలు మూసివేసిన తరువాత అక్కడక్కడ నీరు నిల్వ ఉండే ప్రాంతంలో అధిక సంఖ్యలో లభ్యమయ్యే బొమ్మిడాయిలు, కొరమేనులు, పిత్త పరిగెలు, గొరసలు నేడు మచ్చుకైనా కానరావడం లేదు. గలగల పారే జలాలు ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలుషితమవడంతో జలపుష్పాల జాడ ఏటా తగ్గుతూ వస్తుంది. వేట కొనసాగించినా చేపలు లభ్యత అంతంత మాత్రంగానే ఉండటంతో మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారు. తెలుగింటి లోగిళ్లలో ప్రాముఖ్యం సంతరించుకున్న ఈ జలపుష్పాలు కాలక్రమేణ కనుమరుగవుతుండటం మాంసాహారులను తీవ్ర నిరాశ పరుస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే కాలువ చేపల్లోని కొన్ని జాతులు పూర్తిగా అంతరించిపోతాయని, భావితరాలకు పాఠాలుగా మిగిలిపోయే ప్రమాదముందని మత్స్యకార నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సంప్రదాయ వంటకాల రుచే వేరు

బొమ్మిడాయిలు, కొర్రమీనులు, చితికి చేపలు మన సంప్రదాయ చేపలు. ఇవి బురద, జలాశయాల అడుగు భాగంలో జీవిస్తాయి. పంట కాలువలు, బోదెల్లో ఎక్కువగా మట్టగిడసలు, జెల్ల కొంకులు, బొచ్చులు, బొమ్మిడాయిలు కూడా ఏప్రిల్, మే నెలల్లో కాలువలు మూసివేసిన తరువాత ఈ రకం చేపలు ఒకప్పుడు అధికంగా లభించేవి. కొన్ని జాతుల చేపలు గౌతమీ గోదావరి పరివాహక ప్రాంతంలో లభ్యమవుతున్నా కాలువ చేపలకున్నంత రుచిమాత్రం ఉండదనేది మాంసాహారుల అభిప్రాయం.

అంతరించిపోవడానికి కారణం

పంట పొలాల్లో వినియోగిస్తున్న ఎరువులు, క్రిమి సంహారక మందులు, పొలాల్లో సమీపాన ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల ప్రభావం, వల్ల కాలువల్లో పడేసే వ్యర్థాల వల్ల వివిధ జాతి చేపలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఆయా రకాల కాలుష్యం నీటి జలాశయాల్లో చేరి అడుగు భాగాన నివసించే చేపలపై దుష్ప్రభావాన్ని చూపుతుంది. పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యంలోని అల్యూమినియం హైడ్రాక్సైడ్, రసాయన ఎరువుల్లో ఉండే అమ్మోనియా, క్రిమి సంహారక మందులు నీటి అడుగు భాగంలో చేరి నిల్వ ఉండిపోతుండటం వల్ల అక్కడ ఉన్న ఆక్సిజన్‌ను హరించివేస్తున్నాయి. దీనివల్ల విలువైన మత్స్య సంపదను కోల్పోవవలసి వస్తుంది.



కాలువలో దొరికిన బొమ్మిడాయిలు

మత్స్యసంపదను కాపాడాలి



జలాశయంలో పెరుగుతున్న మత్స్య సంపద నానాటికి కనుమరుగవుతుంది. భావి తరాలు తెలుసుకోకుండా అంతరించిపోతున్న సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది. విచక్షణరహితంగా రసాయనాల వినియోగం ద్వారా మత్స్య సంపద వినాశనానికి దారి తీస్తున్నందున వినియోగం తగ్గించాలి.

– సూర్యతేజ, ఆత్రేయపురం

మత్స్యసంపద కరువు



కాలువల్లో చేపల వేట ప్రారంభం కావడంతో కొనుగోలు చేసేందుకు వెళుతుండగా చేపలు దొరకడం లేదు. కొన్ని జాతుల చేపలు కనుమరుగవడంతో ఆ చేపలను తినేందుకు వెళ్లుతున్న మాంసాహార ప్రియులకు ఆ సంపద లేకపోవడంతో నిరాశకు గురవుతున్నారు.

– ముదునూరి నాగరాజు, ఆత్రేయపురం

సందీప్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



వాడపాలెంలో వైద్య శిబిరంలో ట్రస్ట్ అధ్యక్షుడు చిట్టిబాబు, వైద్యులను అభినందిస్తున్న విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట: తనయుడు సందీప్ స్మృతిలో అతని తల్లిదండ్రులు చిట్టిబాబు దంపతులు చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి వైద్య, సేవలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని వాడపాలెంలో దివంగత వైద్య విద్యార్థి బండారు సందీప్ 35 జయంతి పురస్కరించుకుని సందీప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు బండారు పెదవెర్రియ్య–సత్యవేణి దంపతుల ఆధ్వర్యాన ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సేవా భవనంలో సందీప్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సందీప్ తల్లిదండ్రులకు సహకరిస్తున్న వైద్యులు, యువతను అభినందించి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని చిట్టిబాబు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, పార్టీ రాష్ట్ర నాయకుడు కర్రి నాగిరెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకుడు ఆకుల రామకృష్ణ, బండారు శ్రీనివాసరావు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు బండారు కృష్ణమూర్తి, సర్పంచ్ త్సామా బాబు, ఎంపీటీసీ నేలపూడి భీమరాజు, పెదపూడి శ్రీనివాస్, మట్టా బాబ్జి, బండారు బులితాత, చీకట్ల అబ్బు తదితరులు పాల్గొన్నారు. శిబిరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వైద్య నిపుణులు సుమారు 550 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి చెందిన టెక్నీషియన్లు సుమారు 120 మందికి కంటి పరీక్షలు చేసి 20 మందిని ఆపరేషన్‌కు సిఫారసు చేశారు. 85 మందికి ఉచిత కళ్లజోళ్లు అందించారు. కాకినాడ ట్రస్ట్ హాస్పిటల్, అమలాపురం వైటీ నాయుడు స్కానింగ్ సెంటర్ వారు 80 మందికి ఈసీజీ పరీక్షలు, వానపల్లి ఆర్‌కే డయాగ్నోస్టిక్ సెంటర్ వారు 210 మందికి సుగర్ పరీక్షలు చేశారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

మామిడికుదురు: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కా వెంకటేశ్వరరావు అభిలషించారు. మండల బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక బీసీ సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన ఉచిత పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ శిక్షణలో భాగంగా ఆదివారం విద్యార్థులు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. రూ.320 విలువైన స్టడీ మెటీరియల్‌ను 50 మంది విద్యార్థులకు అందజేశారు. దీనిలో భాగంగా మురళీకృష్ణ, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాలకు చెందిన ఔత్సాహికులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. మే 9వ తేదీ మంగళవారం వరకు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం మండల శాఖ అధ్యక్షుడు నయినాల రఘురామయ్య, ప్రధాన కార్యదర్శి కాగితాలపల్లి నర్సింహారావు, రాయుడు నాగేశ్వరరావు, కుడుపూడి సత్యనారాయణ, వి.సుందరయ్య, కడలి సూర్యచంద్రరావు, బాలం పెద్దిరాజు, నక్కా రాము పాల్గొన్నారు.

వైభవంగా పెద్దింట్లమ్మ జాతర



చింతలూరులో వాసవీమాతకి గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామ దేవత పెద్దింట్లమ్మ జాతర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. చిత్ర, విచిత్ర వేషధారణలు, కాంతారా, శివ పార్వతుల నృత్యాలు, బుట్ట బొమ్మలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ జాతర ఆద్యంతం కనుల పండువలా జరిపించారు. ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన జరిగింది. అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం వరకు అయిదు రోజులు జరుగుతాయని ఆలయ కమిటీ పేర్కొంది. జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాల అలంకరణలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ఘనంగా వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి

ఆత్రేయపురం: స్థానిక సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం మండల ఆర్య వైశ్య సంఘం నాయకులు, సభ్యులు వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు, గోత్రనామ పూజలతో పాటు వివిధ పూజలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. తొలిత స్థానికంగా ఉన్న గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహానికి మండల ఆర్యవైశ్యులు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మండల ఆర్య వైశ్య నాయకులు పాల్గొన్నారు.

అలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వాసవీ కన్యకాపరమేశ్వరి మాత జయంతి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఆలమూరులోని శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయంలో వేద పండితులు రంగాచార్యులు, సాయి భగవాన్, అంగర సింగుబాబు మంత్రోచ్చారణ మధ్య అమ్మవారి భక్తులు కుంకుమార్చన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు డోలు సన్నాయి వాయిద్యాల మధ్య అమ్మవారిని పల్లకీలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తూరు సెంటర్‌లోని ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలో భారీ అన్నసమారాధన జరిగింది.

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు పెద్దమల్లు వీర వెంకట సోమేశ్వర గుప్తా ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారి పుట్టినరోజు వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

మామిడికుదురు: రాష్ట్ర ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్‌కు చెందిన కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కె.శ్రీహరిరావు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర వ్యాప్త సర్వే యాత్ర–2 ఆదివారం మొగలికుదురు చేరింది. దీనిలో భాగంగా స్థానిక బీసీ సామాజిక భవనంలో జరిగిన సమావేశానికి శ్రీహరిరావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు డీవీ సత్యనారాయణ మాట్లాడుతూ సంక్షేమ బోర్డులో గుర్తింపు పొందిన కార్మికులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న అయిదు లక్షల మంది కార్మికుల కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ తీర్మానాలు చేశారు. యూనియన్ కోశాధికారి శ్రీధర్ రవిబాబు, కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళ్ల సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి బత్తుల జనార్దనరావు, మామిడిశెట్టి సత్యనారాయణ, చిట్టూరి సురేష్, గంటి రామారావు తదితరులు పాల్గొన్నారు.


పోతవరంలో తాటాకిల్లు దగ్ధం



పోతవరంలో దగ్ధమవుతున్న తాటాకిల్లు

పి.గన్నవరం: మండలంలోని పోతవరం గ్రామం రాజీవ్ కాలనీలో శనివారం అర్ధరాత్రి నేలపూడి సూర్యానికి చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇల్లు దగ్ధం కావడంతో బాధితులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. రూ.లక్ష మేర ఆస్తి నష్టం వాటిల్లినట్టు రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. తాము ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి తమ ఇంటిని తగలబెట్టాడని బాధితులు నేలపూడి సూర్యం, అతడి భార్య భవాని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి అతడు తమతో గొడవపడి, కక్షతో ఇంటికి నిప్పంటించాడని వారు ఆరోపించారు. తమ కుమారులు అభిషేక్, అరవింద్‌లకు స్వల్పంగా కాలిన గాయాలయ్యాయని తెలిపారు. తమకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వారు విలేకరులకు తెలిపారు.

కుండపోత



చింతలూరులో రాశులుగా పోసి బరకాలు కప్పి ఉంచిన ధాన్యం బస్తాలు

ఆలమూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి వల్ల వరుసగా రెండో రోజు ఆదివారం మధ్యాహ్నం మండలంలోని వివిధ గ్రామాల్లో కుండపోత వర్షం కురిసింది. చేతికొచ్చిన పంట మండు వేసవిలో వర్షార్పణం కావడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల ఎప్పుడు వర్షం కురుస్తుందో తెలియక రైతులు సతమతమవుతున్నారు. ఈ అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా రైతుల పాట్లు పడరాని పాట్లు పడుతున్నారు. వరికోత యంత్రాలతో మాసూళ్లు చేయడం వల్ల పండించిన ధాన్యంలో తేమశాతం తగ్గించేందుకు దాదాపు రైతులందరూ ఖాళీ స్థలాల్లోను, రహదారుల పక్కన ఆరబోసుకున్నారు. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో కొంతమంది రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం తడవకుండా కళ్లాల్లోని ధాన్యంపై బరకాలు కప్పి ఉంచారు. అయినా ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టినా ఇబ్బందులు మాత్రం తప్పడం లేదు.

అనారోగ్య బాధితురాలికి ఎమ్మెల్యే సాయం



చొప్పెల్లలో మహిళకు ఆర్థిక సాయం అందిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



సోంపల్లిలో బాలికకు ఆర్థిక సాయం అందిస్తున్న అగ్నికుల క్షత్రియ నాయకులు

అలమూరు: మండలంలోని చొప్పెల్లలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న గుమ్ములూరు సూర్యావతికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. శనివారం రాత్రి ఉప సర్పంచ్ సుంకర కామరాజు నేతృత్వంలో పార్టీ నేతలు రూ.70 వేల విరాళంతో పాటు ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి తన సొంతంగా రూ.30 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. ప్రభుత్వ పరంగా మెరుగైన చికిత్సను అందించేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి హామీ ఇచ్చారు. పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, సర్పంచ్ దంగేటి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధిత బాలికకు..

రాజోలు: క్యాన్సర్‌కు గురై చికిత్స పొందుతున్న సోంపల్లికి చెందిన మసకపల్లి అలేఖ్యకు రాజోలు తాలూకా అగ్నికుల క్షత్రియ సేవా సంఘం రూ.18 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించింది. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడి నాగలక్ష్మి, అగ్నికుల క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బొమ్మిడి వెంకటేష్ అందజేశారు. అగ్నికుల క్షత్రియ సేవా సంఘం చేపట్టిన సేవా కార్యక్రమాలను వారు అభినందించారు. సంఘ కార్యదర్శి బొమ్మిడి మహేష్, సత్యనారాయణ, కర్రి స్వామినాథ్, తారాడి శివ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: స్థానిక అక్షయ ఆరాధ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు పేదలకు ఆర్థిక సాయం అందించారు. సుమారు రూ.10 వేల చొప్పున తీర ప్రాంత దీన సేవలకుకు అందించారు. ఏటా ఈ సంస్థ ఇలా సాయం అందిస్తుంది. ఆదివారం మలికిపురంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్ చేతుల మీదుగా సాయం అందించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు మేడిది చైతన్యకుమార్, మార్త, అదృష్టరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా వెంకన్న కల్యాణం



అంబాజీపేటలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి

అంబాజీపేట: గోవింద నామస్మరణల మధ్య వెంకన్న కల్యాణం కన్నుల పండువగా జరిగింది. కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి కల్యాణం ఆదివారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. వందలాది మంది మహిళలు స్వామి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో తిలకించారు. అంతకుముందు స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రాంగణం వద్ద సోమవారం స్వామి వారి తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

మలికిపురం: మండలంలోని చింతలమోరి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో వైద్యుడు రాపాక రమేష్‌బాబు వైద్య పరీక్షలు నిర్వహించిన ఉచితంగా మందులు అందించారు. పార్టీ రాష్ట్ర నాయకులు పితాని బాలకృష్ణ, మల్లిపూడి సత్తిబాబు, గుండుబోగుల పెదకాపు, మేడిచర్ల రాము, ఉండపల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో న్యాయమూర్తి



విఘ్నేశ్వరుని సన్నిధిలో జూనియర్ సివిల్ జడ్జి గౌరీశంకర్

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని అమలాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి వి.గౌరీశంకర్ ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత గౌరీశంకర్‌కు ఆలయ అర్చకులు సత్తిబాబు, వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఇటీవలే ఆయన అమలాపురం కోర్టులో నూతనంగా బాధ్యతలు తీసుకున్నానని స్వామిని దర్శించి పూజలు చేశానన్నారు. వేదపండితు వేదాశ్వీరాదం పలికారు. స్వామివారి ఆలయ చరిత్రను వివరించారు. స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆయన వెంట కోర్టు సూపరింటెండెట్ ఉమామహేశ్వరరావు, స్థానిక పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం



నర్సిపూడిలో సుబ్రహ్మణ్యానికి సాయం చేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు

ఆలమూరు: మండలంలోని నర్సిపూడికి చెందిన రేలంగి శివ సుబ్రహ్మణ్యం కాలికి గాయం కావడంతో గత కొన్ని రోజులగా ఇంటి వద్దే ఉంటున్నాడు. కుటుంబ పోషణకు నానా ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న రావులపాలెం కాశీఅన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు శనివారం సుబ్రహ్మణ్యం ఇంటికి వెళ్లి రూ.12,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం బిల్డింగ్ పనికి వెళ్లిన సుబ్రహ్మణ్యం సిమెంట్ బస్తా మోస్తుండగా కాలు జారి బస్తా అతడి కాలు మీద పడి విరిగిపోయిందన్నారు. ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేశారన్నారు. పేదరికం వలన కుటుంబ పోషణ చాలా కష్టంగా మారిందని ఈ విషయం తమకు తెలియడంతో వారికి కుటుంబ పోషణకు, వైద్య ఖర్చుల నిమిత్తం ఈ సాయం అందజేశామన్నారు.

ఘనంగా అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అష్టోత్తర పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు స్వామి వారి అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో ఎం.సత్యనారాయణరాజు, చైర్మన్ ఆర్.రమేష్‌రాజు ఆధ్వర్యాన ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామి భక్తుల సేవా తత్పరత

ఆలమూరు: మండలంలోని చింతలూరు–పెదపళ్ల సెంటర్‌లో వేంచేసిన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం పలు సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కాలజ్ఞాని రూపకర్త, సంఘ సంస్కర్త వీరబ్రహ్మేంద్రస్వామి సజీవ సమాధి నిష్ఠ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు.

మోదీ పాలనలో అభివృద్ధి పథంలో దేశం

పి.గన్నవరం: ప్రధాని మోదీ పాలనలో దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా అన్నారు. మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్‌లో భాగంగా ప్రధాని మోదీ ప్రసంగాన్ని బెల్లంపూడిలో ఆదివారం టీవీల్లో వీక్షించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మామిడికుదురు: ప్రధాని మోదీ దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారని బీజేపీ స్వచ్ఛభారత్ రాష్ట్ర కన్వీనర్ పాలూరి సత్యానందం పేర్కొన్నారు. ప్రధాని మన్‌కీ బాత్ 100 వారాలు పూర్తయిన సందర్భంగా లూటుకుర్రులో రిటైర్డ్ ఉపాధ్యాయుడు కడలి కృష్ణమూర్తిని ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఏడాది దాటినా స్పందన లేదు

మలికిపురం: మండలంలోని లక్కవరంలో పంట కాలువలలో వేసిన మురుగునీటి తూరలు తొలగించాలని గత ఏడాది స్పందనలో ఫిర్యాదు చేసినా నేటికీ స్పందన లేదని గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ముదునూరి సత్య సీతారామరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులు, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన వాపోయారు. అధికారులు తీరు మారకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నేటి నుంచి ప్రత్యేక తరగతులు

ఆలమూరు: ఇటీవల వెలువడిన ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు సోమవారం నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాద రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ కమిషనరేట్ ఆదేశాల మేరకు మే ఒకటి నుంచి 20 వరకూ ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ ఈ తరగతులు నిర్వహించనున్నామన్నారు. స్థానిక కళాశాలలో ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.